
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 సిద్దిపేట
సోమవారం 8 డిసెంబరు 2025





మర్పడగ క్షేత్రంలో పూజలు చేస్తున్న కలెక్టర్ హైమావతి

ఘనంగా ఆర్ద్రా మహోత్సవం

- రుద్రాభిషేకం నిర్వహించిన కలెక్టర్ హైమావతి

కొండపాక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్ద్రా మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మార్గశిర మాసంలో వచ్చిన ఆర్ద్రా నక్షత్రం కావడంతో బ్రాహ్మీ ముహూర్తంలో ఉదయం 4 గంటలకే గణపతి పూజ నిర్వహించి సంతాన మల్లికార్జున స్వామికి విశేష పంచామృత ఫలరస అభిషేకం నిర్వహించారు. అభిషేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమావతి పాల్గొని స్వయంగా సంతాన మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం చేశారు. అనంతరం విజయదుర్గా మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పదిగంటలకు స్వస్తి వాచనం అనంతరం నవగ్రహ,దిక్పాలక,రుద్ర కలశ స్థాపన చేసి సంతాన పాశుపత అభిషేకం, సుబ్రహ్మణ్య స్వామికి విశేష పంచామృత ఫలరస అభిషేకం నిర్వహించారు. అనంతరం సంతాన పాశుపత హవనం, పూర్ణాహుతి జరిగాయి భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

అభ్యర్థులకు 'రియల్' సాయం

శివారు గ్రామాల్లో స్థిరాస్తి వ్యాపారుల మాయాజాలం

ఒకే గ్రామంలో రూ.25 కోట్లు ఖర్చుకు వెనకాడని అభ్యర్థులు 7

అక్రమంగా సంపాదిస్తే జప్తు చేసుకోవచ్చు

బాండ్‌పేపర్‌పై రాసిచ్చిన సర్పంచ్ అభ్యర్థి 7

భారత్ ఫ్యూచర్ సిటీలో జరగబోయే గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను

సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పర్యవేక్షించిన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

- ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్
- అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాట్లు
- సమ్మిట్ ప్రాంగణంలో తెలంగాణ తల్లివిగ్రహం ఏర్పాటు
- అతిథులు, పలు సంస్థల ప్రతినిధులకు ప్రత్యేక వసతులు
- గంటకు పైగా ప్రాంగణాన్ని పరిశీలించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి





గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పర్యవేక్షిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8, 9 తేదీల్లో జరగబోయే గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి ఆదివారం పరిశీలించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ జరగనున్న ప్రాంగణాన్ని స్వయంగా పర్యవేక్షించారు. అంతర్జాతీయ కంపెనీలకు చెందిన ప్రతినిధులు, కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సమ్మిట్‌కు హాజరవుతున్నందున తెలంగాణ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ, స్వాగత ఏర్పాట్లు, వసతి, ఇతర సదుపాయాలు, వివిధ సదస్సులు, స్టాళ్ల కోసం ఏర్పాటు చేసిన హాళ్లను నిశితంగా పరిశీలించి దిశానిర్దేశం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులతో కలిసి నిర్మలాజగ్గారెడ్డి గంటపాటు అన్ని అంశాలను పరిశీలించి అధికారులకు కీలక సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, జయవీర్‌రెడ్డి, ఫ్యూచర్‌సిటీ ప్రత్యేక అధికారి శశాంక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తెరచాటు అభయం

డబ్బు, తాయిలాలు వర్సెస్ సానుభూతి, నిజాయితీ

అటు ధనబలం, పలుకుబడితో ఓటర్లకు గాలం వేస్తున్న అభ్యర్థులు.. ఇటు ప్రజలకు అందుబాటులో ఉంటూ నిజాయితీతో పనిచేస్తామంటున్న వారు... ఒకవైపు పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తూ, విందులు, వినోదాలు ఏర్పాటు... మరోవైపు సెంటిమెంట్‌తో ప్రజల వద్దకు.. వీరిలో పల్లె ఓటర్ల తీర్పు ఎటువైపో అనేది మరో నాలుగు రోజుల్లో తేలనున్నది.

- పంచాయతీ ఎన్నికల్లో సానుభూతి, నిజాయితీది కీ రోల్
- గజ్వేల్ డివిజన్‌లో విందు, మద్యం తిరస్కరణ
- వరుస ఓటములు, త్యాగాల నేపథ్యం ఉన్న అభ్యర్థులకు మద్దతు
- మరోవైపు ఓటర్లకు నగదు, తాయిలాల హామీ
- నాలుగు రోజుల్లో తొలివిడత సంగ్రామం



గజ్వేల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గజ్వేల్ డివిజన్ పరిధి ఏడు మండలాల్లోని 147 గ్రామ పంచాయతీలు, 1209 వార్డుల్లో తొలివిడతగా జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లు విభిన్నమైన ధోరణిని ప్రదర్శిస్తున్నారు. పలు గ్రామాల్లో సెంటిమెంట్ బలంగా పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. నిజాయితీపరులు, వరుసగా ఓటమిపాలైన వారు, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న అభ్యర్థుల పట్ల ప్రజలు సానుభూతిని చూపిస్తూ 'నీకే ఓటేస్తాం' అంటూ తెరచాటుగా అభయం ఇస్తున్నారు. సెంటిమెంట్ ఉన్న అభ్యర్థుల నుంచి మద్యం సైతం పుచ్చుకోవడం లేదని, బహిరంగంగానే తమ మద్దతు ప్రకటిస్తున్నారని సమాచారం. అయితే తాయిలాలు, నగదు పంపిణీ ముందు ఈ సెంటిమెంట్, నిజాయితీ ఎంత మేరకు నిలబడతాయో వేచి చూడాలి.

పలు గ్రామాల్లో సెంటిమెంట్ వర్కౌట్


- మొదటి విడత ఎన్నికలు జరిగే ఓ గ్రామంలో సర్పంచ్ స్థానంలో ఒకరు ఆస్తులు ఉన్న ధనవంతుడు కాగా, మరొకరు ఎప్పుడూ ప్రజల్లోనే ఉంటూ, ఆస్తులేమి లేని వ్యక్తి. అక్కడ ధనవంతుడైన ప్రత్యర్థిని కాదని, మరో అభ్యర్థిని ఇంటికి పిలిచి మరీ 'బిడ్డా, నువ్వేం రూపాయి ఖర్చు చేయకు. మాకు డబ్బులు వద్దు, మద్యం వద్దు. నీ దగ్గర రూపాయి లేదు. ఇబ్బంది పడకు. మా ఓట్లు మీకే వేస్తాం' అని అభయం ఇచ్చినట్లు సమాచారం.
- మరో గ్రామంలో తండ్రి ప్రజాప్రతినిధిగా పోటీ చేసి ఓడిపోవడం, కొడుకు గత ఎన్నికల్లో ఓటమి పాలు కావడం, ఆస్తులు అమ్ముకోవడం, తండ్రిని కోల్పోవడం వంటి కష్టాలు ఎదుర్కొన్నారు. తండ్రి ఆశయ సాధన కోసం కొడుకు మరోసారి బరిలో దిగడంతో, అనేక ఇబ్బందులు పడిన ఈ కుటుంబానికి అండగా నిలవాలన్న సంకల్పంతో ప్రజలు స్వయంగా మద్దతు ప్రకటిస్తున్నారని తెలిసింది.
- కొన్ని గ్రామాల్లో సీనియర్ నాయకుల పట్ల అనాసక్తిని కనబరుస్తున్న ఓటర్లు, రెండు

మిగతా 8వ పేజీలో

బుజ్జగింపులు

మూడో విడతలో పలుచోట్ల ఏకగ్రీవం వైపు అడుగులు

- ఉపసంహరణకు ఇంకా రెండు రోజుల గడువు



హుస్నాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణకు మరో రెండు రోజుల గడువు ఉంది. ఆలోగా తమకు ఎదురులేకుండా చూసుకుని ఏకగ్రీవం చేసుకునేందుకు పలువురు అభ్యర్థులు పావులు కదుపుతున్నారు. గ్రామ పెద్దలతో, పార్టీ నేతలతో బుజ్జగింపులు చేపడుతున్నారు.

మూడో విడత హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, కొమురవెల్లి, కొండపాక, కుకునూరుపల్లి, ధూలిమిట్ట, మద్దూరు, చేర్యాల మండలాల్లోని 163 గ్రామ పంచాయతీలకు, 1,432 వార్డుల్లో ఎన్నకలు జరుగుతున్నాయి. ఆదివారం అభ్యంతరాలను స్వీకరించారు. తమ నామినేషన్లను తిరస్కరించిన అభ్యర్థులు ఎవరు అప్పీలుకు వెళ్లనట్లు సమాచారం. ప్రస్తుతం సర్పంచ్‌లకు 834, వార్డుల్లో 3,551 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

పలుచోట్ల ఏకగ్రీవం

అక్కన్నపేట మండలంలో 6 గ్రామ పంచాయతీలు, 84 వార్డులు ఏకగ్రీవం కానున్నాయి. కోహెడలో ఒకటి, కుకునూరుపల్లిలో రెండు స్థానాలు ఏకగ్రీవం కానున్నాయి. కుకునూరుపల్లి మండలంలోని పిటి వెంకటాపూర్ పంచాయతీ ఏకగ్రీవమైంది. ఇద్దరు సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేయగా ఒకరు ఉపసంహరించుకున్నారు. ఎనిమిది వార్డులకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే వచ్చింది. ఇదే మండలంలోని రామచంద్రాపూర్‌లోనూ ఇద్దరిలో ఒక సర్పంచ్ అభ్యర్థి నామినేషన్ ఉపసంహరించుకోవడంతో ఏకగ్రీవమైంది. నాలుగు వార్డులు కూడా ఏకగ్రీవమయ్యాయి.

ఎవరి ప్రయత్నాల్లో వారు

మంగళవారం నామినేషన్ల ఉపసంహరణలు ఉండటంతో అప్పుడే తమ ప్రత్యర్థి అభ్యర్థులను పోటీ నుంచి తప్పించేందుకు బుజ్జగింపులు మొదలయ్యాయి. పలు గ్రామాల్లో ఒకే పార్టీకి చెందిన ఇద్దరు, ముగ్గురు సర్పంచ్‌గిరికి పోటీ చేస్తుండటంతో వారిని సమన్వయం చేసి ఒకరినే బరిలో నిలిపేందుకు ఆయా పార్టీల ద్వితీయ శ్రేణి నాయకులు రంగలంలోకి దిగారు. పోటీ నుంచి తప్పుకునేందుకు ఆఫర్లు కూడా ప్రకటిస్తున్నారు. మరికొన్ని చోట్ల ఒక పార్టీలోని వ్యక్తులు ఇద్దరు పోటీలో ఉంటే తాను గెలిచేందుకు అందులోని ఒక వ్యక్తిని రంగంలో ఉంచేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. అందుకు ఎన్నికల ఖర్చుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇస్తున్నారు. ఈ రెండు రోజులు నామినేషన్ల ఉపసంహరించేందుకు ఎవరి ప్రయత్నాలు వారుగా సాగిస్తున్నారు.

పంచాయతీ పోరులో మాజీలు

- ఆకునూరులో పొలిటికల్ హీట్
- పలుచోట్ల సై అంటున్న రెబెల్స్



చేర్యాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పలు గ్రామాల్లో రిజర్వేషన్లు అనుకూలించడంతో తాజా మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గతంలో ఎన్నికైన వారి కుటుంబీకులు మళ్లీ పోటీకి ఉవ్విళ్లూరుతున్నారు. తాజా మాజీలకు ఒక్కో గ్రామంలో రూ.5 నుంచి 10లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉండటంతో పాటు ఎన్నికల ఖర్చుకు వెనకాడుతుండటంతో పలు గ్రామాల్లో పోటీలో వెనుకంజ వేస్తున్నప్పటికీ కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు నయానో, బయానో ఒప్పించి, మెప్పించి బరిలో నిలుపుతున్నారు. కానీ స్థానిక వేలం, కుల రాజకీయాలతో తలకిందులవుతుండటంతో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. రిజర్వేషన్ల అనుకూలంగా ఉన్న గ్రామాల్లో తామే స్వతహాగా నామినేషన్లు వేయగా, మహిళలకు రిజర్వ్ అయిన స్థానాలలో సతీమణులతో వేయించారు.

చేర్యాల మండలం నాగపురి, కడవేరుగు, తాడూరు, దానంపల్లి, వీరన్నపేట పంచాయతీల్లో తాజా మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, లేదా వారి సతీమణులు, తనయులు బరిలో నిలిచారు. ఇక మండలంలోని ఏకైక మేజర్ గ్రామ పంచాయతీ అయిన ఆకునూరులో పోటీ మామూలుగా లేదు. మాజీ సర్పంచు, మాజీ జడ్పీటీసీ భర్త, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు, తాజా మాజీ సర్పంచు, మాజీ సర్పంచు భర్త, మాజీ ఉపసర్పంచులు ఇద్దరు నామినేషన్లు దాఖలు చేశారు. ఆకునూరు గ్రామంలో ఆయా పార్టీలు ప్రత్యేక దృష్టి సారించడంతో పొలిటికల్ హీట్ నెలకొంది.

రెబెల్స్ బెడద

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లలో పలువురు రెబెల్స్ సైతం పోటీకి సై అంటున్నారు. పలు గ్రామాల్లో ఒకరి చొప్పున, మరిన్ని గ్రామాల్లో ఎక్కువగానే నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధానంగా మండలంలోని ఏకైక మేజర్‌గ్రామపంచాయతీ ఆకునూరు, దానంపల్లి, పోతిరెడ్డిపల్లి, అర్జునపట్ల, శబాషీగూడెం, ముస్త్యాల తదితర గ్రామాల్లో ఈ పరిస్థితి ఉంది.

రేవంత్‌కు బండకట్టి రంగనాయకసాగర్‌లో తోయాలి

- అప్పుడు కాళేశ్వరం కూలిందో లేదో తెలుస్తుంది
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



చిన్నకోడూరులో మొక్కజొన్నలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

చిన్నకోడూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరం కూలిందని అంటున్నారని, ఒక్కసారి సిద్దిపేటకు రావాలని ఒక బండ కట్టి రంగనాయకసాగర్‌లో వేస్తే మునుగుతారో, తెలుతారో చూద్దామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అప్పుడు కాళేశ్వరం కూలిందా, తేలిందా తెలుస్తుందన్నారు. చిన్నకోడూరు మండల కేంద్రంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించి మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ఎంత సేపు మాజీ సీఎం కేసీఆర్‌ను, బీఆర్ఎస్ నాయకులను తిట్టుకుంటు పొద్దు గడుపుతున్నారు తప్ప ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా 49 వేల మంది రైతుల వద్ద నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు చేసిందని సుమారు రూ.450 కోట్లు మొక్కజొన్న రైతులకు చెల్లింపులు బకాయిపడిందన్నారు. హైదరాబాద్‌లో కూర్చొని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ రైతులకు 48 గంటల్లో డబ్బులు పడుతున్నాయని మాట్లాడుతున్నారని తెలిపారు. తాను మొక్కజొన్న రైతుల మధ్య నిలబడి మాట్లాడుతున్నాని మొక్కజొన్నలు అమ్మి 50 రోజులు అవుతున్నా ఇప్పటివరకు డబ్బులు రావడం లేదని, రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఓట్లు డబ్బాలో పడగానే వచ్చే యాసంగికి రైతు బంధుకు రాంరాం చెప్పే పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. రైతులు ఆలోచించాలని ప్రభుత్వానికి గుణ పాఠం చెప్పాలని, కాంగ్రెస్ బలపరచిన అభ్యర్థులను ఓడిస్తేనే ప్రభుత్వానికి కనువిప్పు కల్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఏస్ చైర్మన్‌లు సదానందం, కనకరాజు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మండలాధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య తదితరులు పాల్గొన్నారు. చిన్నకోడూరు మండలం రామంచ గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎర్ర భవాని నవీన్ గ్రామస్థులతో కలిసి ఆదివారం సిద్దిపేటలో మాజీ మంత్రి హరీశ్‌రావును కలిశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు భవానిని సన్మానించి అభినందించారు.

పేద విద్యార్థుల చదువుకు అండగా ఉంటా

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థుల చదువుకు తానెప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట పట్టణానికి చెందిన వైద్య విద్యార్థిని శ్రీజ ఆయనను కలిసి, ఆర్థిక సహాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీజ వైద్య విద్య పూర్తి అయ్యే వరకు తాను ఫీజు చెల్లిస్తా ఈ సందర్భంగా హరీశ్‌రావు విద్యార్థినికి హామీ ఇచ్చారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

- మంత్రి వివేక్ వెంకటస్వామి



గజ్వేల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో మనస్పర్థలు పక్కకు పెట్టి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్‌వెంకటస్వామి సూచించారు. గజ్వేల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సర్పంచ్ అభ్యర్థుల, ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు అంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. జూబ్లీహిల్స్‌లో పార్టీ గెలుపును స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం నియోజకవర్గంలో ఏకగ్రీవమైన ఏడుగురు కాంగ్రెస్ సర్పంచ్‌లను ఆయన సన్మానించారు. వారితో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షారెడ్డి తదితరులున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

వర్గల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వర్గల్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఉల్లాసంగా... ఉత్సాహభరితంగా జరిగింది. 1991 నుంచి ఇప్పటి వరకు ఉన్న విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. విద్యార్థులు వారి గత స్మృతులను నెమరు వేసుకుంటు మధురానుభూతులను ఒకరినొకరు పంచుకున్నారు. విద్యాలయం ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ పవర్ ప్రజెంటేషన్ ద్వారా ఈ విద్యా సంవత్సరంలో జరిగిన పలు కార్యక్రమాలను వివరణ ఇచ్చారు. గతంలో పనిచేసిన పలువురు అధ్యాపకులు, విశ్రాంతి సిబ్బంది, పూర్వ విద్యార్థులు వారి అనుభవాలను తెలుపుతూ అనోందోత్సవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. గతంలో పనిచేసిన, ప్రస్తుతం ఉన్న ప్రిన్సిపాల్‌లను, ఇన్చార్జి ప్రిన్సిపాల్‌లను, భోదన, భోదనేతర సిబ్బందిని ఘనంగా సత్కరించారు. విరాళాలు అందజేసిన పూర్వ విద్యార్థులను సన్మానించారు.



వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో పూర్వ విద్యార్థులు

రెండు తలల దూడ జననం.. మృత్యువాత

తూప్రాన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలో రెండు తలల దూడ జన్మించింది. పట్టణానికి చెందిన అర్కల కృష్ణ కు చెందిన గేదె శనివారం రాత్రి ప్రసవించింది. దూడకు రెండు తలలు ఉండడంతో కుటుంబీకులు, పశు వైద్యులు రెండు గంటలు శ్రమించి దూడను బయటకు లాగారు. అయితే కాసేపటికి దూడ మృత్యువాత పడడంతో పూడ్చిపెట్టారు.





కల్హేర్ మండలం దేవునిగుట్ట మల్లన్న స్వామి జాతరకు హాజరైన అశేష జనవాహిని

జనసంద్రమైన దేవుని గుట్ట

● వైభవంగా మల్లన్న స్వామి జాతర ● స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన జనం

కల్హేర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కల్హేర్ మండల పరిధిలోని దేవునిపల్లి గ్రామ శివారులోని దేవునిగుట్ట మల్లన్న స్వామి జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. మార్గశిర మాసం రెండో ఆదివారం నిర్వహించే ఈ జాతర ఉత్సవాల్లో మల్లన్న స్వామి దర్శించుకోవడానికి అశేషంగా భక్తులు తరలివచ్చారు. ఉదయం దేవునిపల్లి, మాసాన్‌పల్లి గ్రామాలకు చెందిన గొల్ల, కుర్మ యాదవులు స్వామి వారికి సంప్రదాయంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గుట్ట చుట్టూ ఎడ్ల బండ్ల ఊరేగింపు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు అశేషంగా హాజరైన భక్తులతో గుట్ట ప్రాంతమంతా నిండిపోయింది. జాతర ఉత్సవాల్లో సంగారెడ్డి, కామారెడ్డి, మెదక్, నిజామాబాద్, హైదరాబాద్ జిల్లాలకు చెందిన భక్తులతో పాటు సరిహద్దున ఉన్న కర్నాటక, మహారాష్ట్రలకు చెందిన భక్తులు కూడా అధిక సంఖ్యలో హాజరై మల్లన్న స్వామిని దర్శించుకున్నారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా కల్హేర్ ఎస్ఐ రవిగౌడ్ సిబ్బందితో కలిసి బందోబస్తు చర్యలు చేపట్టారు.



దేవుని గుట్టపై మల్లన్న స్వామి దర్శనం చేసుకోవడానికి బారులు తీరిన భక్తులు

ఆదివారం ఆలయాలు కిటకిట



స్వామివారి దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

కొమురవెల్లి/పాపన్నపేట/జగదేవ్‌పూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆదివారం సెలవు రోజు సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని పలు ప్రధాన ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దీంతో ఆయా ఆలయాల నిర్వాహకులు భక్తులు ఇబ్బందులు కలుకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామివారి సన్నిధిలోని గంగిరేణి చెట్టు వద్ద, ఆలయ ముఖమండపంలో భక్తులు పట్నాలు వేసి బోనాలు చెల్లిం అనంతరం స్వామిని దర్శించుకొని బండారు, పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు గుట్టపై ఉన్న ఎల్లమ్మ, పోచమ్మ అమ్మవార్లకు పట్టువస్త్రాలు, బోనాలు, ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

● ఏడుపాయల వనదుర్గామాత దర్శనానికి ఉమ్మడి జిల్లా వాసులతో పాటు పరిసర జిల్లాలైన నిజామాబాద్, కరీంనగర్, జంట నగరాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకులు అమ్మవారికి అభిషేకం చేపట్టి సహస్రనామార్చన, కుంకుమార్చన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.



దుర్గమ్మ తల్లికి హారతి ఇస్తున్న అర్చకుడు

● జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ నర్సాపూర్ గ్రామ సమీపంలో గల కొండపోచమ్మ ఆలయంలో అమ్మవారికి రంగులతో అలంకరించిన బోనాలను నెత్తిపై ఎత్తుకొని డప్పు చప్పుళ్లతో శివసత్తుల శిగాలతో ఊరేగింపుగా తీసుకుచ్చి సమర్పించారు. ఒడిబియ్యం పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కొండపోచమ్మ దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

అయోధ్యలో ప్రత్యేక పూజల్లో మాధవానందస్వామి

● పాల్గొన్న మెదక్ జిల్లా భక్తులు



అయోధ్యలో మాధవనందస్వామితో పాటు మెదక్ జిల్లా భక్తులు

నర్సాపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలోని కొల్చారం మండలం రాంపూర్ పీఠాధిపతి మాధవానందస్వామి ఆధ్వర్యంలో కాశీ, అయోధ్యలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత నెల 28 నుంచి డిసెంబరు 4 వరకు కాశీలో శ్రీమద్భాగవత జ్ఞానయజ్ఞం, అలాగే అయోధ్యలో ఈ నెల 6, 7 తేదీల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో పాల్గొనడానికి మెదక్ జిల్లా నుంచి వందల సంఖ్యలో భక్తులు వెళ్లారు. ఇందులో నర్సాపూర్ నుంచి మాజీ జడ్పీటీసీ మాధవి జగదీష్, మాజీ ఎంపీపీ రమణరావు, మాజీ వార్డు సభ్యుడు నర్సింలు దంపతులతో పాటు పలువురు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత



పెద్దశంకరంపేటలో అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్న అధికారులు

పెద్దశంకరంపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్పెషల్ టీం సిబ్బంది పట్టుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం పెద్దశంకరంపేట నుంచి టాటా వాహనంలో 5 కాటన్ల మద్యాన్ని తరలిస్తుండగా ప్రత్యేక సిబ్బంది పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యయ పరిశీలకులు జుల్ఫీ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలు జరిగే అన్ని గ్రామాల్లో స్పెషల్ టీంతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేయవద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో షాకీర్ అలీ, ఏఎస్ఐ చంద్రమోహన్, చంద్రన్న, తదితరులు ఉన్నారు.

● గజ్వేల్ రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని గజ్వేల్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. అక్రమంగా మద్యం తరలిస్తున్నారని సమాచారం అందుకున్న పోలీసులు గజ్వేల్ పట్టణ శివారులోని బయ్యారం చౌరస్తా వద్ద తనిఖీలు చేపట్టారు. బయ్యారం గ్రామానికి చెందిన పంగా ప్రశాంత్, వంటేర్పుల స్వామి బైక్‌పై మద్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. వారి నుంచి రూ.11454 విలువ గల మద్యం స్వాధీనం చేసుకున్నారు.

మృతి చెందిన నవజాత శిశువు లభ్యం



ఘటనా స్థలంలో విచారణ జరుపుతున్న అధికారులు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని ఆర్అండ్‌బీ డీఈఈ కార్యాలయం ఎదుట నవజాతశిశువు మృతదేహం శనివారం రాత్రి లభ్యమైంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో సంగారెడ్డి పట్టణ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని లభ్యమైన శిశువును సంగారెడ్డి జీజీహెచ్ మార్చురీకి తరలించారు. విషయం తెలుసుకున్న జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలోని జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారులు శిశువు లభించిన ప్రాంతానికి ఆదివారం ఉదయం చేరుకొని విచారణ ప్రారంభించారు. ఈ ఘటనపై సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు చుట్టు పక్కల అంగన్‌వాడీల కార్యకర్తల ద్వారా జిల్లా వ్యాప్తంగా విచారణ చేస్తున్నామని జిల్లా సంక్షేమాధికారి లలితకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైన అప్పుడే పుట్టిన పిల్లలను వద్దనుకుంటే సంగారెడ్డిలోని శిశుగృహకు అప్పగిస్తే పిల్లలు లేని కుటుంబాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం దత్తత ఇవ్వనున్నట్టు తెలిపారు.

పోలీస్ వాహనాన్ని ఢీ కొట్టిన చేపల లారీ

● లారీ బోల్తా.. పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

హుస్నాబాద్‌రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డ పోలీస్‌చెక్ పోస్టు వద్ద శనివారం అర్ధరాత్రి ఆగి ఉన్న పోలీస్ వాహనాన్ని చేపల లారీ ఢీ కొట్టింది. ఆ సమయంలో పోలీస్ వాహనంలో ఎవరూ లేక పోవడంతో ప్రాణాపాయం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. గూడూరు నుంచి ఢిల్లీకి వెళ్తున్న చేపల లారీ హుస్నాబాద్ పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద నిలిపి ఉన్న పోలీస్ వాహనాన్ని ఢీ కొట్టి బోల్తా పడింది. దీంతో పోలీస్ వాహనం రోడ్డు కిందకు పొలాల్లోకి 200 మీటర్ల మేర దూసుకుపోయింది. లారీ డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలు కాగా చికిత్స నిమిత్తం గాయపడిన హుస్నాబాద్ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని హుస్నాబాద్ ఏసీపీ సదానందం, సీఐ శ్రీనివాస్ పరిశీలించారు. లారీని క్రేన్ సహాయం పక్కకు తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. లారీ డ్రైవర్ మద్యం మత్తులో నడపడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని ఏసీపీ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు.



బోల్తాపడిన లారీ, రోడ్డు కిందికి దూసుకెళ్లిన పోలీస్ వాహనం

అభ్యర్థులకు రియల్ సాయం

● గ్రామాల్లో స్థిరాస్తి వ్యాపారుల మాయాజాలం ● ఒకే గ్రామంలో కోట్ల ఖర్చుకు వెనకాడని అభ్యర్థులు



పటాన్‌చెరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో వ్యాపారులు రాజకీయాలను శాసిస్తున్నారు. అభ్యర్థులకు ఆర్థిక సాయం చేస్తున్నారు. బరిలో ఉండే ఇద్దరు అభ్యర్థులను ఆర్థికంగా ఆదుకుంటున్నారు. ఇద్దరిలో ఒకరిని ఎంపిక చేసుకొని గెలిపించుకునే పనిలో ఉంటూ, ఒకవేళ ఓడిపోయినా డబ్బులు తీసుకున్న గెలిచిన మరో అభ్యర్థిని తనవాడిగా మార్చుకుంటున్నారు. పటాన్‌చెరు మండలం భానూరు, క్యాసారం, నందిగామ గ్రామాల్లో అభ్యర్థుల మధ్య హోరాహోరీగా ఎన్నికల ప్రచారాలు జరుగుతున్నాయి. నువ్వా నేనా అన్నట్లుగా ఇంటింటి ప్రచారాలు సాగుతున్నాయి. ఈ రెండు గ్రామాల్లో పూర్తిగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు బరిలో ఉన్నారు. పేరొందిన ఓ రియల్ వ్యాపారికి చుట్టుపక్కల గ్రామాల్లో పెద్దఎత్తున ఖరీదైన భూములు ఇప్పించడం నిత్య ప్రక్రియగా మారింది. గ్రామస్థుల నుంచి భూములు లాక్కోవడంలో చాకచక్యత ప్రదర్శిస్తున్నందుకు పెద్ద మొత్తాల్లో నిత్యం కమిషన్ తీసుకోవడం అలవాటుగా మారింది. ప్రస్తుతం పోటీపడుతున్న అభ్యర్థులు ఇద్దరికీ నామినేషన్ వేసిన మరుక్షణం కోటి రూపాయల చొప్పున అందజేసినట్లు తెలిసింది. ఎన్నికకు రెండు రోజుల ముందు పెద్దఎత్తున నిధులు అందజేయడానికి సదరు వ్యాపారి సన్నాహాలు చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో ఒక అభ్యర్థికి ప్రత్యేకంగా పెద్దఎత్తున నిధులు సమకూర్చేందుకు వ్యాపారి సమాయత్తమైనట్లు తెలిసింది. అలా ఒక్క గ్రామంలో ఇద్దరు అభ్యర్థుల ఖర్చులు కలిపితే రూ.20 కోట్లు దాటే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఒక్క మద్యానికే కోటి రూపాయలు వెచ్చిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. తెల్లవారుజాము నుంచి ప్రచారం చేస్తున్నారు. ప్రత్యేకంగా భోజనాలు పెడుతున్నారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లను ప్రలోభానికి గురి చేయడానికి ఒక్కో ఓటరుకు ఒక్కో అభ్యర్థి రూ.30 వేల చొప్పున ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది.







వలస ఓటర్ల కోసం పట్నం బాట

● పోలింగ్‌కు రప్పించేందుకు రానుపోను ఖర్చులు అందజేత

ఝరాసంగం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచ్, వార్డు సభ్యులు తమ గ్రామాల నుంచి జీవనోపాధి కోసం హైదరాబాద్‌లో ఉన్న ఓటర్లతో సంప్రదింపులు జరిపి, వారిని రెండో విడత పోలింగ్ రోజు, డిసెంబర్ 14న, తిరిగి గ్రామాలకు రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకోసం అవసరమైన బస్సు ఛార్జీలు, ఇతర ఖర్చులను భరించేందుకు సిద్ధమయ్యారు. అంతేకాకుండా, తమకే ఓటు వేసేలా వారి నుంచి మాట కూడా తీసుకుంటున్నట్లు సమాచారం. ఎందుకంటే, ఈ పంచాయతీ ఎన్నికల్లో వలస ఓటర్లే కీలకం కానున్నారు. కొంతమంది అభ్యర్థులు వీరి కోసం పట్నంలోనే మకాం వేశారు. ఓటర్లకు ముందుగానే ఖర్చులు, ఛార్జీలను చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. అభ్యర్థులకు వచ్చిన గుర్తులను పదే పదే చెప్పి, తప్పక ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు.

2 జీపీలు, 69 వార్డులు ఏకగ్రీవం

ఝరాసంగం మండలంలో 33 గ్రామ పంచాయతీలు, 516 వార్డులు ఉండగా, చీలపల్లి, చీలపల్లితండా తో పాటు 69 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. రెండో విడత ఎన్నికలు 31 గ్రామ పంచాయతీలతో పాటు 447 వార్డు సభ్యులకు జరగనున్నాయి. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ బాక్స్‌లతో పాటు ఇతర సామాగ్రి కూడా మండలానికి చేరుకున్నాయి.

మాజీ సర్పంచుల కోడళ్ల మధ్యే పోటీ





నారాయణఖేడ్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని మండల కేంద్రమైన నిజాంపేటలో ఇద్దరు మాజీ సర్పంచుల కోడళ్ల మధ్యే పోటీ నెలకొననుంది. నారాయణఖేడ్ డివిజన్‌లో నిజాంపేట అతిపెద్ద గ్రామం. నిజాంపేటలో 4259 మంది ఓటర్లు ఉన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో మాజీ సర్పంచులుగా పని చేసిన చీలపల్లి సాయిరెడ్డి కోడలు కావ్య, జాల బాలయ్య కోడలు జాలలక్ష్మి పోటీ చేస్తున్నారు. చీలపల్లి కావ్య మామ సాయిరెడ్డి గతంలో నిజాంపేట సర్పంచ్‌గా ఒకసారి, ఎంపీపీ ఉపాధ్యక్షులుగా ఇటీవలి వరకు పని చేశారు. జాల బాలయ్య రెండు సార్లు నిజాంపేట సర్పంచ్‌గా పని చేయడమే కాకుండా, ఆయన భార్య గంగమ్మ ఒకసారి పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో ఇద్దరు మాజీ సర్పంచుల కోడళ్లే పోటీ చేయడం రసవత్తరంగా మారింది. విజయం ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.

గంగారాం తండా సర్పంచు ఏకగ్రీవం




నాగల్‌గిద్ద,డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నాగల్‌గిద్ద మండల పరిధిలోని గంగారాం తండా సర్పంచుగా రాథోడ్ రేణుక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ మద్దతు దారు అభ్యర్థి అయిన ఆమె ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. ఇక్కడున్న 8 వార్డులకూ ఒక్కొక్కటి చొప్పున నామినేషన్లు దాఖలవడంతో అన్నీ ఏకగ్రీవమయ్యాయి. ఇంకా అధికారులు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

అక్రమంగా సంపాదిస్తే జప్తు చేసుకోవచ్చు

● బాండ్ పేపర్‌పై రాసిచ్చి మరీ సర్పంచ్ అభ్యర్థి ప్రచారం

చేర్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో చేర్యాల మండలం తాడూరు గ్రామ కాంగ్రెస్ మద్దతు అభ్యర్థి బొడికె నర్సింహులు వినూత్న తరహా ఆలోచన చేశారు. తన పట్ల నమ్మకం కుదిరేలా నాన్-జుడీషియల్ స్టాంప్ పేపర్‌పై రాయించి గ్రామస్తులను ఆకర్షించే ప్రయత్నం చేయడం చర్చనీయాంశంగా మారింది. తాను అక్రమంగా సంపాదించనని, తన కుటుంబానికి ప్రస్తుతం ఉన్న ఆస్తులకు మించి ఎంత సంపాదించినా వాటిని గ్రామ పంచాయతీ జప్తు చేసి ప్రజలకు పంచవచ్చని పేర్కొన్నారు. పనులు చేయడానికి ప్రజల వద్ద చేయిచాచబోనని, గ్రామ పంచాయతీ సొమ్ము దుర్వినియోగం చేయబోనని, తప్పుడు లెక్కలు చూపించకుండా సమగ్రాభివృద్ధికి పాటుపడతానని గ్రామస్థులకు తెలిపారు. తాను రాసి ఇచ్చిన బాండ్ పేపర్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్ అయింది. ఇదిలా ఉండగా, గతంలో మాజీ ఎంపీపీగా వ్యవహరించిన బొడికె నర్సింహులు చాలా రోజులుగా రాజకీయాలకు దూరంగా ఉండి వ్యవసాయం పనులు చేసుకుంటూ సాదాసీదా జీవనం సాగిస్తున్నాడు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా రిజర్వేషన్ అనుకూలించడంతో గ్రామ సర్పంచ్‌గా నామినేషన్ దాఖలు చేశారు. ప్రత్యర్థుల బలాన్ని తట్టుకుని ప్రజల ఆశీర్వాదం మూటగట్టుకునేందుకు బాండ్ పేపర్ రాసి ఇవ్వడంతో ఒక్కసారిగా తాడూరు గ్రామం హాట్‌టాపిక్‌గా మారింది.


भारतीय गैर न्यायिक
पचास रुपये FIFTY RUPEES
रू.50 Rs.50
INDIA NON JUDICIAL
తెలంగాణ TELANGANA

తాడూరు సర్పంచు అభ్యర్థి బొడికె నర్సింహులు రాసి ఇచ్చిన బాండ్ పేపర్

పదవైతే వచ్చింది కానీ... విచారణే పరేషాన్..!

దుబ్బాక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆ గ్రామంలో బహిరంగంగా వేలం పాట పాడారనే కేసు నమోదు కావడం దేవుడెరుగు..? ఇప్పుడు ఏకగ్రీవం అయిన సర్పంచ్‌కు విచారణ తంటా మొదలైందనే చెప్పాలి. అక్బర్‌పేట-భూంపల్లి మండలం తాళ్లపల్లి గ్రామంలో బహిరంగంగా వేలం పాట చేపట్టారని 63 మందిపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఊరంతా ఏకమై, గ్రామంలోని నీలం ప్రభాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కేసు పుణ్యమా అని, నయా పైసా లేకుండానే సర్పంచ్‌పై ఏకాభిప్రాయం కుదిరి, ఏకగ్రీవంగా సర్పంచ్ పదవి దక్కిందని అంతా భావించారు. ఐతే ఏకగ్రీవంపై మాత్రం పోలీసులు కూపీ లాగే ప్రయత్నం వదలడంలేదు. కొంత డబ్బులు చేతులు మారవచ్చనే అనుమానంతో విచారణ మాత్రం సీరియస్‌గానే సాగిస్తున్నట్లు తెలిసింది. పదవైతే వచ్చిందికానీ... విచారణే కొత్త సర్పంచ్‌కు పరేషాన్ తప్పదేమో..?

ఏకగ్రీవమైతే అయ్యాడు... ఇంటి కుదవకు తిరుగుతున్నాడు..!

● పదవి తెచ్చిన తంటా... బాకీ తప్పదంటా

దుబ్బాక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక నియోజకవర్గంలోని ఒక గ్రామ పంచాయతీలో ఒక వ్యక్తి సర్పంచ్ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏదో సామాజిక సేవ చేశాడనీ కాదు సుమా..! ఈ ఊరిలోని ఒక దేవాలయంకు తన వంతుగా భారీ మొత్తమే అందిస్తానని హామీనిచ్చి, సర్పంచ్ పదవిని చేజిక్కించుకున్నారు. సర్పంచ్ పదవి దక్కిన మరుసటి రోజు నుంచీ అసలు తంటా మొదలైంది. తాను గొప్పగా పలికి, హామీనిచ్చిన మొత్తాన్ని నెరవేర్చేందుకు గ్రామస్థులు వెంటపడటం మొదలైంది. నయాపైసా చేతిలో లేని సదరు కొత్త సర్పంచ్‌గారు గత్యంతరం లేక తన ఇంటిని కుదువపెట్టేందుకు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం చుట్టూ, ప్రైవేటు ఫైనాన్షియల్ సంస్థల చుట్టూ తిరగక తప్పడంలేదు. సుమారు పది లక్షలకు తన ఇంటిని కుదువపెట్టేందుకు రుణం కోసం తిరుగుతున్న ఆ సర్పంచ్‌గారిని చూసి, అంతా జాలిపడుతున్నారు. ఏది ఏమైనా పదవి తెచ్చిన తంటా... బాకీ తప్పదు ఇంటా..! అని గుసగుసలు మొదలైనాయి.

సర్పంచ్‌గా కార్వాన్ ఎమ్మెల్యే సతీమణి ఏకగ్రీవం



వెల్దుర్తి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బస్వాపూర్ గ్రామ సర్పంచ్‌గా కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ సతీమణి నజ్మా సుల్తానా ఎన్నికయ్యారు. బస్వాపూర్ పంచాయతీ సర్పంచ్‌కు నజ్మా సుల్తానాతో పాటు కాసాల ఇందిర నామినేషన్ వేశారు. కాగా, ఆదివారం కాసాల ఇందిర తన నామినేషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు సమర్పించారు. దీంతో బస్వాపూర్ సర్పంచ్ స్థానం ఏకగ్రీవం కానుంది. అలాగే, పంచాయతీ పరిధిలోని 8 వార్డులకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో పాలకవర్గం పూర్తి స్థాయిలో ఏకగ్రీవం అయింది. పాలకవర్గం ఎన్నికను సంబంధిత అధికారులు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

పోతిరెడ్డిపల్లి గ్రామపెద్దలకు బైండోవర్ నోటీసులు



పోతిరెడ్డిపల్లి సర్పంచ్ అభ్యర్థితో పాటు గ్రామ పెద్దలకు కౌన్సెలింగ్ చేస్తున్న హుస్నాబాద్ ఏసీపీ సదానందం

చేర్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పలువురు పెద్దమనుషుల పట్ల పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఓ అభ్యర్థిని ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు సమావేశాలు ఏర్పాటు చేయడంతో పాటు అతడు ఇచ్చిన హామీ మేరకు భూమిని పలువురు వ్యక్తుల పేరిట రిజిస్ట్రేషన్ చేయడానికి యత్నించగా రెవెన్యూ అధికారులు, పోలీసులు అడ్డుకున్న విషయం విదితమే. కాగా, రోజురోజుకూ పోతిరెడ్డిపల్లి గ్రామ వ్యవహారం ముదిరిపోతుండటంతో పోలీసులు ఆదివారం ఆయా గ్రామ పెద్దలను స్టేషన్‌కు పిలిపించారు. హుస్నాబాద్ ఏసీపీ సదానందం వారికి కౌన్సెలింగ్ చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించినందుకు బైండోవర్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా చేర్యాల సీఐ ఎల్.శ్రీను ఉన్నారు. అంతకుముందు ఏసీపీ సదానందం మండలంలోని దానంపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఎన్నికల నియమావళి పట్ల అవగాహన కల్పించారు. ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

గ్యాస్ లీకేజీ.. నిత్యావసర సరుకులు దగ్ధం



బెజ్జంకి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ లీకేజీతో ప్రమాదవశాత్తు మంటలంటుకుని నిత్యావసర సరుకులు దగ్ధమైన సంఘటన బెజ్జంకి మండలంలోని ముత్తన్నపేటలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... ముత్తన్నపేటకు చెందిన కనగండ్ల పోచవ్వ, ఆమె కుమారుడు గోపి కూలీ పనులు చేసుకుంటూ గ్రామంలో ఓ చిన్న ఇంట్లో ఉంటున్నారు. ఇంట్లో రాత్రి వంట చేసుకునేందుకు గ్యాస్ స్టవ్ వెలిగించగా, గ్యాస్ లీకేజీతో మంటలు స్టవ్ వద్ద అంటుకున్నాయి. భయంతో పోచవ్వ, గోపి ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీశారు. మంటలు వ్యాపించి ఇంట్లోని నిత్యావసర సరుకులు, దుస్తులు, వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని స్థానికుల సాయంతో మంటలు ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను ఐక్యంగా ఎదుర్కొందాం

కోటి మంది అసంఘటిత కార్మికులకు గుర్తింపు లేదు

దుర్మార్గమైన లేబర్ కోడ్‌లను

అమలు చేయబోమని కేరళ ప్రభుత్వం తేల్చింది

సీఐటీయూ రాష్ట్ర మహాసభల్లో వక్తలు



ప్రసంగిస్తున్న సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు హేమలత

మెదక్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక చట్టాలతో పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులు కనుమరుగవుతాయని, అందుకనే ఐక్య పోరాటాల ద్వారా లేబర్ కోడ్ చట్టాలను ఎదుర్కొందామని సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు కామ్రేడ్ హేమలత పిలుపునిచ్చారు. ఆదివారం మెదక్‌లోని చిల్డ్రన్స్ పార్క్ ప్రాంగణంలో సీఐటీయూ రాష్ట్ర 5వ మహాసభలను అట్టహాసంగా ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ సభలకు తొలిరోజు ఆదివారం హాజరై ఉద్విగ్నభరిత ప్రసంగం చేశారు. లేబర్ కోడ్ వల్ల కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తూ, గత పది సంవత్సరాల క్రితం కార్మికులకు అందిన వేతనాలే ఇప్పటికీ వర్తిస్తున్నాయని వాపోయారు. 168 రూపాయల నెలసరి వేతనంగా కేంద్రం ప్రకటించడం దోపిడీ కాదా? అని ప్రశ్నించారు. యూనియన్ పెట్టుకోవడానికి కూడా కార్మికులకు అనుమతి ఉండని చట్టాలను ప్రవేశపెడుతుండడం అమానుషమన్నారు. దేశంలో అంబానీ సంపద 2014లో 10వేల కోట్లు కాగా, ప్రస్తుతం రూ.10 లక్షల కోట్లకు పడగలెత్తారని వివరించారు. రాష్ట్ర నాయకులు వీరయ్య మాట్లాడుతూ విదేశీ కార్మికులు మాత్రమే తమ వేతనాలు పెంచమని యాజమాన్యాలపై ఒత్తిడి తెస్తారని, కానీ భారతీయ శ్రామికులు మాత్రం డబ్బు ఆశపడని వ్యక్తిత్వం కలవారని కొత్త లేబర్ పాలసీలో పొందుపరచడంలో ఉద్దేశాన్ని వివరించారు. రాష్ట్రంలో 30 లక్షల మందికి సొంత ఇళ్లు లేవని, 2021 కల్లా దేశప్రజలందరికీ శాశ్వత ఇళ్లు కట్టిస్తామని ప్రధాని మోదీ మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో రాష్ట్ర నాయకులు చుక్క రాములు మాట్లాడుతూ, కామ్రేడ్ కేవల్ కిషన్ పోరాటాల స్ఫూర్తితో సీఐటీయూ కార్మికోద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తుందని తెలిపారు. సమావేశంలో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, జిల్లా కార్యదర్శి మల్లేశం, రాష్ట్ర నలుమూలల నుంచి ప్రతినిధులు విచ్చేశారు.



సభలో ప్రసంగిస్తున్న రాష్ట్ర నాయకులు చుక్క రాములు


ఎరుపెక్కిన మెదక్ పట్టణం


సీఐటీయూ రాష్ట్ర మహాసభల సందర్భంగా మెదక్ పట్టణం కమ్యూనిస్టు కార్యకర్తలతో ఎరుపమయమైంది. ఎర్ర జెండాలు చేతబూని విప్లవ గేయాలు ఆలపిస్తూ, డప్పుల దరువుకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ పట్టణ వీధుల గుండా మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. స్థానిక మార్కెట్ యార్డు కమాన్ నుంచి గోల్కొండ వీధి, పాత బస్టాండ్, మున్సిపల్ కార్యాలయం, రాందాస్ చౌరస్తాల మీదుగా చిల్డ్రన్స్ పార్క్ వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు.

దైవదర్శనానికి వెళ్తుండగా ప్రమాదం

● లారీని ఢీకొన్న కారు

● తండ్రి, కూతురు మృతి.. పలువురికి గాయాలు





శ్రీశైలం, సుదీక్ష (ఫైల్)

పటాన్‌చెరు డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి దైవదర్శనానికి వెళ్తుండగా కారు లారీని ఢీకొన్న ఘటనలో తండ్రి, కూతురు మృతిచెందిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ విజయకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజ్‌గిరికి చెందిన శ్రీశైలం (40), భార్య లక్ష్మీ, కుమార్తె సుదీక్ష (8), శ్రీశైలం స్నేహితులు తిరుపతి, జ్యోతిలక్ష్మి, శాశిక, దుపికతో కలిసి కారులో తిరుపతికి శనివారం అర్ధరాత్రి ప్రయాణమయ్యారు. మేడ్చల్ వద్ద అవుటర్ పైకి ఎక్కి ప్రయాణిస్తుండగా తెల్లాపూర్ పురపాలిక పరిధి పాటి గ్రామ సమీపంలో ఎదురుగా వెళ్తున్న లారీ పక్క లైన్ నుంచి వీరి కారు వెళ్తున్న లైన్‌లోకి వచ్చింది. అప్పటికే వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి లారీ వెనుక భాగాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుదీక్ష అక్కడికక్కడే మృతి చెందింది. శ్రీశైలంను ఆసుపత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. లారీలో ఉన్న మిగతా వారు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను హైటెక్‌సిటీలోని యశోదా ఆసుపత్రికి తరలించారు. శ్రీశైలం తమ్ముడు శ్రీహరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



ఘటనా స్థలంలో పడి ఉన్న క్షతగాత్రులు



పోలింగ్ కేంద్రానికి సంబంధించిన సామాగ్రిని సిద్ధం చేస్తున్న అధికారులు

పంచాయతీ ఎన్నికల సామగ్రి సిద్ధం

వెల్దుర్తి, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మూడో విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ సామగ్రిని అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల ఎన్నికల అధికారిణి ఉమాదేవి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు పోలింగ్ కేంద్రాలలో అవసరం ఉన్న సామాగ్రిని సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు అతిథి అధ్యాపకుల ఇంటర్వ్యూలు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ప్రవీణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్ల, కెమిస్ట్రీ విభాగాలలో బోధించుటకు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 8న తారా కళాశాలలో ఉదయం 10 గంటల వరకు సంప్రదించాలని సూచించారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్‌సెట్, రెండు పాస్ ఫొటోలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ కోరారు.

తాళం వేసిన రెండు ఇళ్లలో చోరీ

● నగలు, నగదు అపహరణ

నర్సాపూర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో పట్టపగలు దొంగలుపడ్డారు. దండగులు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడి నగలు, నగదు ఎత్తుకెళ్లిన ఘటన నర్సాపూర్ పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి ఆదివారం రాత్రి తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నర్సాపూర్ పట్టణంలోని వినాయక్‌నగర్‌లో గూనగంటి మొగులయ్య, గూనగంటి రమేష్ అన్నదమ్ములు నివాసముంటున్నారు. ఆదివారం ఉదయం ఇద్దరు అన్నదమ్ములు పనిమీద శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్లకు వెల్లగా వారిద్దరి భార్యలు పట్టణంలోని టైలర్‌షాపనుకు ఇంటికి తాళం వేసి వెళ్లారు. తిరిగి మహిళలు ఇంటికి వచ్చి చూడగా రెండు ఇళ్లకు తాళం పగులగొట్టి తలుపులు తెరిచి ఉండటంతో వారి భర్తలైన రమేష్, మొగులయ్యలకు సమాచారమిచ్చారు. వారు సాయంత్రం తిరిగి ఇంటికి చేరుకుని చూడగా రమేష్ ఇంట్లో రూ.10వేలు, పది తులాల వెండినగలు, అరతులం బంగారు ఉంగరం, అదే విధంగా మొగులయ్య ఇంట్లో బంగారు చెవి కమ్మలు, చిన్నపిల్లల బంగారు చెవిరింగులు, బంగారు ముక్కుపుడక, పదితులాల వెండి బిల్లలు, వెండిగొలుసు, రూ.40వేల నగదు తస్కరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సంక్షిప్తం

ఘనంగా అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



విశేష అలంకరణలో స్వామివారు

చేర్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం 33వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయాన్ని సర్వాంగసుందరంగా పూలమాలలతో ముస్తాబు చేశారు. మూలవిరాట్టుతో పాటు ఉత్సవమూర్తికి విశేష అభిషేకం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

వీరభద్రస్వామి ఆలయంలో పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణం కొత్తబస్టాండ్ సమీపంలోని శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఉదయం 5 నుంచి 10 గంటల వరకు సామూహిక అభిషేకాలు చేశారు. ఆరుద్ర నక్షత్రం రోజు స్వామివారికి అభిషేకం చేయడం చాలా పుణ్యప్రదమని చెబుతారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మఠం శివకాంత్ స్వామి పూజలు జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

పట్టా ఇచ్చారు.. భూమి చూపడం మరిచారు



పట్టాపాసు పుస్తకాలు, వినతిపత్రాలు చూపుతున్న షేక్ మహబూబ్

నారాయణఖేడ్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : భూమి లేని తనకు 25 ఏళ్ల క్రితం సిర్గాపూర్ శివారులో 2 ఎకరాల భూమిని పంపిణీ చేసి.. అందుకు సంబంధించిన పట్టాపాసు పుస్తకం అందజేసినా ఇప్పటికీ భూమిని చూపలేదని సిర్గాపూర్‌కు చెందిన అమీనాబీషేక్ మహబూబ్ వాపోయారు. ఆదివారం ఖేడ్‌లో విలేకరులతో మాట్లాడుతూ అప్పట్లో పట్టా పాసు పుస్తకం ఇవ్వగా ధరణి అందుబాటులోకి వచ్చాక కొత్త పట్టాపాసు పుస్తకం సైతం ఇచ్చారన్నారు. తనకు కేటాయించిన భూమిని చూపాలంటూ 25 ఏళ్లల్లో అనేకమార్లు, స్థానిక, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. గతంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 18 ఎకరాల్లో సర్వే నిర్వహించి మూడున్నర ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని గుర్తించినా హద్దులు చూపి అప్పగించడం లేదన్నారు. పట్టాపాసు పుస్తకాలు, ఇప్పటివరకు అందజేసిన వినతిపత్రాల ప్రతులను రిజిష్టర్ పోస్టు ద్వారా ఖేడ్ సబ్ కలెక్టర్, కలెక్టర్‌కు పంపినట్లు వివరించారు. నెలరోజుల్లో తనకు న్యాయం చేయకపోతే సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని తెలిపారు.

మూలనపడ్డ చెత్త రిక్షాలు

- అధికారుల నిర్లక్ష్యమే కారణం



మరమ్మతులు చేయకపోవడంతో మూలనపడ్డ చెత్త రిక్షాలు

శివ్వంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛభారత్‌లో భాగంగా బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో చెత్తను సేకరించేందుకు చెత్త రిక్షాలను కొనుగోలు చేసింది. కాగా నాలుగేళ్లలోనే ట్రాక్టర్లు సైతం కొనుగోలు చేయడంతో చెత్త రిక్షాలు మూలనపడ్డాయి. మండల పరిధిలోని పెద్ద గొట్టిముక్ల గ్రామపంచాయతీ ఎదుట మూడు చెత్త రిక్షాలు మరమ్మతుకు నోచుకోక మూలనపడి ఉన్నాయి. అధికారులు స్పందించి రిక్షాలకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భౌబోయ్ కుక్కలు..

- కోహెడలో రోడ్లపై గుంపులుగా సంచారం
- బెంబేలెత్తిపోతున్న ప్రజలు
- విద్యార్థులకూ తప్పని ఇక్కట్లు
- వాహనదారులను వెంటాడుతుండటంతో అదుపు తప్పి గాయాలపాలవుతున్న వైనం



కోహెడలో అంబేద్కర్ చౌరస్తా వద్ద కుక్కల గుంపు

కోహెడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పల్లెలు.. పట్టణాలు అనే తేడా లేకుండా మండలంలోని ఏ కూడలిలో చూసినా గుంపులుగా వీధి కుక్కలు దర్శనమిస్తున్నాయి. ద్విచక్రవాహనాలపై వెళ్లేవారిని వెంటాడి మరీ గాయపరుస్తున్నాయి. ఇక పాదచారుల ఇక్కట్లు అంతా ఇంతా కాదు. ఆసుపత్రుల్లో చికిత్స కోసం వచ్చే కుక్కకాటు బాధితుల సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. బాధితుల్లో కొందరు ప్రభుత్వాసుపత్రులకు వెళ్తే, మరికొందరు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు.

రోడ్లపై యథేచ్ఛగా సంచారం

ఇంట్లో నుంచి బయటికి అడుగు పెట్టాలంటేనే బాబోయ్.. కుక్కలు అంటూ ప్రజలు బెంబేలెత్తే పరిస్థితి నెలకొన్నది. కోహెడ మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, పోచమ్మ వాడ, ఎస్సీ కాలనీల్లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలతో చిన్నారులు, వృద్ధులు భయాందోళనలకు గురవుతున్నారు. కోహెడలోని ఏ వార్డులో చూసినా కుక్కలు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి.. దీంతో ఆయా కాలనీల్లో ఒంటరిగా వెళ్లాలంటేనే కాలనీవాసులు జంకుతున్నారు. 500కు పైగా కుక్కలు ఉన్నాయని గ్రామస్థులు అంటున్నారు.

రోడ్డుపైకి రావాలంటేనే..

ఉదయం వేళ స్కూల్ బస్సులకు కోసం కాలనీల్లో రోడ్లపై విద్యార్థులు వేచి ఉంటున్న సందర్భంలో కుక్కల గుంపును చూసి భయపడుతున్నారు. అత్యవసర పనులమీద వేగంగా ద్విచక్రవాహనాలపైన వెళ్లే వారిని వెంటాడటంతో వాహనాలు అదుపు తప్పి గాయాలబారిన పడిన సంఘటనలు ఎన్నో చోటు చేసుకున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఆదివారం అంబేద్కర్ చౌరస్తా వద్ద కుక్కలున్న గుంపు ఓ ద్విచక్రవాహన చోదకుడిపైకి దూసుకువచ్చాయి. చాకచక్యంగా అతడు తప్పించుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు వివరించారు. కాలనీలో సైతం గుంపులు, గుంపులుగా ఉన్న కుక్కలతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. ఇటీవలే గుంపులుగా ఉన్న కుక్కలు ఓ పాదచారుడిపై దాడికి ప్రయత్నించగా స్థానికులు బెదిరించడంతో అవి పారిపోయాయి. మండల కేంద్రమే కాకుండా గ్రామాల్లో కూడా ఇలాంటి పరిస్థితి నెలకొందని, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల బారి నుంచి రక్షించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వానరమూక స్వైరవిహారం

మద్దూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో ఎక్కడ చూసినా కోతుల మూక స్వైరవిహారంతో జనం జడుసుకుంటున్నారు. రోడ్డుపై పాదచారులు నడవలేని పరిస్థితి నెలకొన్నది. ద్విచక్రవాహనదారులు సైతం భయం భయంగా వెళ్లాల్సి వస్తున్నది. వ్యవసాయదారులైతే కోతుల గుంపును రోజుకు రెండు మూడుసార్లు దూరంగా తరమాల్సి వస్తోంది. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యాన్ని తిన్నంత తిని చిందరవందర చేస్తున్నాయి. వాటిని తరిమినా పోవడం లేదంటూ రైతులు వాపోతున్నారు. కోతుల బారిన పడి గాయాలైన వారు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ వాక్సిన్ వేయించుకుంటున్న ఘటనలూ ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల పుణ్యమా అంటూ అభ్యర్థులు కోతులను పట్టించి గ్రామస్థులు, రైతుల ఇబ్బందులను తొలగిస్తామని బాండ్ పేపర్ల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు. అభ్యర్థుల హామీలు, బాండ్ పేపర్ల మాటెలా ఉన్నా, కోతుల బెడద తొలగేదెన్నడో అని ప్రజలు చర్చించుకుంటున్నారు.



మద్దూరులో ప్రభుత్వ కార్యాలయాల రోడ్డుపై కోతుల గుంపు

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన టీపీసీసీ అధ్యక్షుడు



బండి భాగ్యలక్ష్మి దశదినకర్మలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్

దుబ్బాక, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట భూంపల్లి మండలం పోతారెడ్డి పేట గ్రామంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గీతా పారిశ్రామిక సంఘం మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు స్వర్గీయ బండి నర్సాగౌడ్ సతీమణి బండి భాగ్యలక్ష్మి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. దివంగత బండి బాగ్యలక్ష్మి దశదిన కర్మ సందర్భంగా ఆదివారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ గ్రామానికి వచ్చారు. ఆయన బండి భాగ్యలక్ష్మి చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బొమ్మెర సంయుక్త శ్రీధర్, దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకటస్వామి గౌడ్, జిల్లా కార్యదర్శి ఏలూరి కమలాకర్, మండల ప్రధాన కార్యదర్శి కోనపురం బాల్‌యాదవ్, మాజీ ఎంపీటీసీలు మంద చంద్రసాగర్, పాతూరి శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

ఆర్మీకి ఎంపికైన యువకుడికి సన్మానం



మ్యాక చందును సన్మానిస్తున్న చిట్యాల గ్రామస్థులు

చేర్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన మ్యాక చందు భారత సైనికదళానికి ఎంపికయ్యాడు. దీంతో ఆదివారం గ్రామస్థులు చందుకు ఘన స్వాగతం పలికి, గ్రామ ప్రధాన చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహావరణలో శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు చిట్యాల రామోహన్‌రావు, మాజీ ఎంపీటీసీ మిట్టపల్లి సులోచన, నాయకులు జంబియ రాజు, ఆకుల కనకయ్య, ఆకుల జంపయ్య, పిల్లి బాబు, సత్తాల గణేశ్‌తో పాటు అతడి కుటుంబీకులు పాల్గొన్నారు. కాగా చిట్యాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మద్దతు గల సర్పంచు అభ్యర్థి వంకాయల రమణ ఎమ్మెస్సీ పూర్తి చేయగా, ఎన్‌సీసీ కెడెట్‌గా శిక్షణ పొంది సర్టిఫికెట్ సైతం సాధించింది. తమ గ్రామానికి చెందిన యువకుడు ఆర్మీకి ఎంపికవడంతో హర్షం వెలిబుచ్చుతూ ఎన్‌సీసీ కెడెట్ అయిన రమణ అతడికి గౌరవ వందనం చేసింది. ఈ దృశ్యాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

ఎన్నికల నియమావళి పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మహబూబ్ అలీ

నంగునూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల నియమావళి పాటించాలని ఎంపీడీవో మహబూబ్ అలీ పేర్కొన్నారు. ఆదివారం నంగునూరు రైతు వేదికలో సర్పంచ్ వార్డు స్థానాలకు పోటీలో ఉన్న అభ్యర్థులకు మోడల్ కోడ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ పి.మాధవి, రాజగోపాల్ పేట ఎస్ఐ టి.వివేక్ , మండల విద్యాశాఖ అధికారి దేశిరెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు ఎన్నికల నియమావళి ప్రకారం నడచుకోవాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ర్యాలీలు, మైక్‌లతో ప్రచారం నిర్వహించ కూడదని చెప్పారు. సమావేశంలో ఆయా గ్రామాల సర్పంచ్, వార్డు స్థానాల అభ్యర్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలి



భారత రాజ్యాంగ పరిరక్షణ ప్రచారోద్యమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ భారతరాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలని రాష్ట్ర ఎస్సీఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని లింగుపల్లి గ్రామంలో దళిత బహుజనఫ్రంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారత రాజ్యాంగ పరిరక్షణ ప్రచారోద్యమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగంతోనే సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. 76వ భారత రాజ్యాంగ వజ్రోత్సవ వేడుకలను పురస్కరించుకుని రాజ్యాంగ పరిరక్షణ ప్రచారోద్యమాన్ని నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, నాయకులు రవి, వెంకటస్వామి, సురేష్, స్వామి తదితరులున్నారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలి





కొమురవెల్లి మండలం అయినాపూర్ గ్రామంలో గ్రామస్థులతో మాట్లాడుతున్న హుస్నాబాద్ ఏసీపీ సదానందం, మిరుదొడ్డిలో అభ్యర్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్, లింగుపల్లిలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ సమత

కొమురవెల్లి/మద్దూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని హుస్నాబాద్ ఏసీపీ సదానందం పేర్కొన్నారు. ఆదివారం ఆయన కొమురవెల్లి, మద్దూరు మండలాల్లో పర్యటించి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. త్వరలో కొమురవెల్లి మల్లికార్జున స్వామివారి కల్యాణం జరగనున్న నేపథ్యంలో భద్రత, ఇతర ఏర్పాట్లను కొమురవెల్లి పోలీసులతో కలిసి ఏసీపీ పరిశీలించారు. అనంతరం కొమురవెల్లి మండలంలోని అయినాపూర్ గ్రామాన్ని సందర్శించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అందరూ ఎన్నికల నియమాళిని పాటించాలని సూచించారు. ఎన్నికలను అడ్డం పెట్టుకొని గ్రామాల్లో గొడవలకు దిగితే చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. వెంట సీఐ ఎల్ శ్రీను, ఎస్ఐ మహేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మద్దూరు మండలంలోని నర్సాయపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం హుస్నాబాద్ ఏసీపీ సదానందం సందర్శించి పరిశీలించారు. ఈ నెల 17న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్న పోలింగ్‌ను దృష్టిలో పెట్టుకుని బందోబస్తు ఏర్పాటుకు సన్నాహాలు చేసేందుకు సందర్శించినట్లు తెలిపారు. గ్రామంలో పోలింగ్ సమయంలో శాంతిభద్రతలకు సమస్యలు తలెత్తకుండా చూడనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దూరు ఎస్ఐ షేక్ మహబూబ్ అలీతో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- **మిరుదొడ్డి:** ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని దుబ్బాక సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. ఆదివారం మిరుదొడ్డిలోని ఓ ఫంక్షన్ హాల్లో స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఎన్నికల నియమావళిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేవిధంగా చూడాలని సూచించారు. పోటీ చేసే అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రచారం చేసే అభ్యర్థులు ముందస్తుగా అనుమతిని తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీడీవో గణేష్‌రెడ్డి, నోడల్ అధికారి జగదీశ్వర్, ఎస్ఐ సమత తదితరులున్నారు.

ఓటర్లను ప్రలోభాలను గురిచేస్తే..

స్థానికఎన్నికల నేపథంలో ఓటర్లను వివిధ రకాల ప్రలోభాలకు గురిచేసే వారిపై గట్టి నిఘా ఉంటుందని మిరుదొడ్డి ఎస్ఐ సమత అన్నారు. ఆదివారం మిరుదొడ్డి మండలం లింగుపల్లి స్టేజీవద్ద ఎన్నికల నేపథ్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ఓటర్లను ప్రభావితం చేయడానికి నిబంధనలు ఉల్లంఘిస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. అలాంటి వారిపై కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు.

క్షేత్రస్థాయిలో కనిపించని స్వచ్ఛత



కొమురవెల్లి ప్రధాన చౌరస్తాలో మురుగు నీరు నిలిచి పచ్చగా మారిన దృశ్యం

కొమురవెల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ఇతర అనేక కార్యక్రమాలు చేపట్టినప్పటికీ క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించడం లేదు. వివరాల్లోకి వెళ్తే.. కొమురవెల్లి గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో మురుగునీరు నిలిచి పచ్చగా మారి దుర్గంధం వెదజల్లుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. నిత్యం ఈ చౌరస్తా గుండానే మల్లికార్జునస్వామి దర్శనానికి భక్తులు తరలివస్తుంటారు. స్థానిక ప్రజలు కూడా ఈ చౌరస్తా నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. ఇంత రద్దీగా ఉండే చౌరస్తాలో నీరు నిలిచి దుర్గంధం, దోమలు విజృంభిస్తున్నా ఏ ఒక్కరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్‌రాజు పండరికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న రాష్ట్ర హైకోర్టు జడ్జి సౌర్యపల్లి నంద

మర్కుక్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రవల్లి గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్‌రాజు పండరిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌హాల్‌లో నిర్వహించిన తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ జాతీయ రాజ్యాంగ దినోత్సవ ముగింపు ఉత్సవాలకు ఆహ్వానించారు. డిసెంబరు 6న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి సౌర్యపల్లి నంద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె చెన్‌రాజ్ పండరిని జ్ఞాపికతో సన్మానించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

'భారత రాజ్యాంగం - విలువలు' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న సామాజిక సమరసత వేదిక సభ్యులు

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవ పక్షోత్సవాల సందర్భంగా సిద్ధిపేటలోని సరస్వతీ శిశు మందిర్‌లో రాజ్యాంగ విలువలపై పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం విలువలు అనే పుస్తకాన్ని జిల్లా అధ్యక్షుడు డా. ఏ. అరవింద్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాంగంలోని 15, 16, 17 ఆర్టికల్‌లు సమానత్వం, సోదరభావం, న్యాయం వంటి మౌలిక హక్కులను అందిస్తున్నాయన్నారు. సామాజిక సమరసత వేదిక రాష్ట్రవ్యాప్తంగా కుల, మత విభేదాలు లేని సమాజ నిర్మాణం, ముఖ్యంగా సంచారజాతుల హక్కుల రక్షణ కోసం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. సంచారజాతులకు చెందిన కొన్ని కులాల పేర్లు ఇప్పటికీ ప్రభుత్వ రికార్డుల్లో లేవని, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో రమేష్, మనోహర్, సంతోష్, మల్లారెడ్డి, విజయ భాస్కర్, శ్రీకాంత్, శ్రీనివాస్, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

రామకోటి సంస్థ ఆధ్వర్యంలో తలాంబ్రాల పంపిణీ



దుబ్బాకలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరాలయంలో భక్తులకు తలంబ్రాలు పంపిణీ చేస్తున్న సంస్థ వ్యవస్థాపకుడు రామరాజుస్వామి

దుబ్బాక, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): భద్రాచల దేవస్థాన సీతారాముల కల్యాణానికి రెండు పర్యాయాలు రామకోటి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు స్వామి గోటి తలంబ్రాలు అందించిన విషయం తెలిసిందే. ఆదివారం ఆయన దుబ్బాకలోని బాలాజీ ఆలయంలో భక్తులకు భద్రాచల దేవస్థానానికి సంబంధించిన ముత్యాల తలంబ్రాలతో పాటు దేవస్థానం వారి శ్రీరామ రక్ష స్తోత్రం పుస్తకాలు సైతం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... లోక కల్యాణర్థం ప్రతి ఒక్కరూ శ్రీరామరక్ష స్తోత్రం పారాయణం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

18, 23 తేదీల్లో సంగారెడ్డిలో సదరం క్యాంపులు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఈ నెల 18, 23 తేదీల్లో సదరం క్యాంపులు(యూడీఐడీ) నిర్వహించనున్నట్టు సూపరింటెండెంట్ డా.మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త వారు, రెన్యూవల్ కోసం మీ సేవలో స్లాట్ బుక్ చేసుకొని హాజరుకావాలని సూచించారు. స్లాట్ బుక్ చేసుకున్న దివ్యాంగులకు ఫోన్ కాల్ లేదా మెసేజ్ సందేశం వచ్చినవారే క్యాంపునకు హాజరుకావాలని పేర్కొన్నారు.

తెరచాటు అభయం

(5వ పేజీ తరువాయి)

మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్న వారిని కాకుండా, సదరు స్థానాల్లో బరిలో నిలిచిన కొత్త అభ్యర్థులకే మద్దతు పలుకుతున్నారు. కొత్తవారికి అవకాశం ఇవ్వాలనే నిర్ణయంతో ప్రజలు ఉన్నట్లు తెలుస్తోంది.

ఓటర్లకు గాలం..

ప్రచార పర్వం చివరి దశకు చేరుకుంటున్న దశలో ఓటర్లను బుట్టలో వేసుకునేందుకు అభ్యర్థులు తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో పలువురు అభ్యర్థులు ఇప్పటికే గుడులకు, కుల సంఘాలకు తాయిలాలను అందజేస్తామని హామీ ఇవ్వగా, మరికొన్ని గ్రామాల్లో నగదు పంపిణీకి హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. యువతకు క్రికెట్ కిట్లు, ఇతర క్రీడాసామగ్రిని ఎన్నికల తర్వాత అందజేస్తామని కొందరు అభ్యర్థులు వాగ్దానం చేస్తున్నారు. మొత్తంగా పంచాయతీ ఎన్నికల్లో సెంటిమెంట్, నిజాయితీ, త్యాగం చేసిన వారికి అభయం ఇవ్వడం వంటి పరిణామాలు, కొత్త వారికి అవకాశం ఇవ్వాలనే నిర్ణయాలు కనబడుతున్నప్పటికీ, చివరి సమయంలో ప్రలోభాల గండం ఎంతమంది దాటుతారో చూడాలి.